బొర్రంపాలెం సర్పంచి చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై సర్పంచి కలపర్తి వెంకటేశ్వరమ్మ చెక్ పవర్‌ను జిల్లా పంచాయితీ అధికారులు రద్దు చేసినట్లు ఎంపిడిఒ జి.మణికుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గుండె పాండురంగ బొర్రంపాలెం పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయగా స్పందించిన ఉన్నతాధికారులు విచారణ జరిపిన సంగతి తెలిసిందే. అనంతరం నిధుల దుర్వినియోగం నిర్ధారణ కావడంతో సర్పంచి వెంకటేశ్వరమ్మ చెక్ పవర్ రద్దు చేసి అప్పటి పంచాయతీ కార్యదర్శుల వద్ద నుండి దుర్వినియోగమైన నిధులు రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

ముందస్తు సాగుపై ప్రణాళిక ఏదీ..!

ఖరీఫ్ సాగుపై అంతటా అయోమయం

జూన్ ఒకటో తేదీన సాగునీటి విడుదలపై నీలినీడలు

రుతుపవనాలు ముందుగా రానున్నట్లు వాతావరణశాఖ ప్రకటన

ఖరీఫ్ ముందస్తుగా సాగితే తుపాన్ల గండం నుంచి రైతులకు ఊరట

గతంలో దీనిపై పెద్దఎత్తున ప్రచారం.. నేడు ఆ ఊసే కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ ముందస్తు సాగుపై ప్రభుత్వం వద్ద ప్రణాళిక కనిపించడం లేదు. ముందస్తు సాగుపై గతంలో అనేక ప్రకటనలు గుప్పించిన ప్రభుత్వం ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. పంటకాలువలకు సాగునీటి విడుదలపైనా ఇప్పటికీ తేదీని ప్రకటించని పరిస్థితి ఉంది. రైతులకు మేలు చేసే ఖరీఫ్ ముందస్తు సాగుపై ప్రభుత్వం ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రానున్న ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో రెండు లక్షలు, పశ్చిమలో 2.10 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన విత్తనాలు వంటివి ఇప్పటికే సిద్ధం చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సాగు ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో మాత్రం తెలియని పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ సాగు ఆలస్యంతో నవంబర్ నెలాఖరుకుగాని కోతలు రావడం లేదు. దీంతో పంటలు తుపాన్ల బారిన పడి రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. దీంతో 2014-19 మధ్యకాలంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ముందస్తు సాగుకు ప్రభుత్వం పూనుకుంది. జూన్ ఒకటో తేదీనే పంట కాలువకు సాగునీరు విడుదల చేసి, ముందుగా ఖరీఫ్ సాగు ప్రారంభించేందుకు రైతులను సమాయత్తం చేసే కార్యక్రమాలు చేపట్టింది. దీనిలో భాగంగానే ఏరువాక కార్యక్రమాన్ని ప్రభుత్వం పెద్దఎత్తున నిర్వహించింది. వైసిపి ప్రభుత్వం సైతం జూన్ ఒకటిన కాలువలకు సాగునీరు విడుదల చేసి ముందస్తు సాగుకు ప్రయత్నాలు చేసింది. రుతుపవనాలు ఆలస్యం కావడంతో కొన్నిసార్లు సాగు ముందుకు సాగని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ ఏడాది మే 28వ తేదీ నాటికే కోస్తాంధ్ర అంతటా రుతుపవనాలు ప్రవేశించనున్నట్లు వాతావరణశాఖ చెబుతోంది. గడిచిన పదేళ్లలో ఇటువంటి సానుకూల పరిణామం లేదని సైతం చెబుతున్న పరిస్థితి. ఇప్పటికే ప్రతిరోజూ వర్షాలు కురుస్తుండటంతో భూమి సైతం చల్లబడిన పరిస్థితి. వాతావరణం అనుకూలంగా ఉన్న తరుణంలో ముందస్తు సాగుపై ఎటువంటి ప్రణాళికలూ లేకుండాపోవడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

పంట కాలువలకు సాగు నీరు వదిలితే ముందస్తు సాగుకు అవకాశం

గడిచిన పదేళ్లుగా పంట కాలువలకు ప్రతియేటా జూన్ ఒకటో తేదీన సాగునీరు విడుదల చేస్తూ వస్తున్నారు. ఈసారి అటువంటి పరిస్థితి కన్పించడం లేదు. ఇప్పటికీ సాగునీరు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారికంగా ప్రకటించలేదు. జూన్ మొదటివారంలో విడుదల చేసే అవకాశం ఉన్నట్లు మాత్రం చెబుతున్నారు. గతంలోకంటే సాగునీటి విడుదల ఆలస్యం కానున్నట్లు స్పష్టమవుతోంది. అదే జరిగితే ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే పరిస్థితి ఉంది. జూన్‌లో నారుమడులు పూర్తయితే నాట్లు త్వరగా పూర్తవుతాయి. దీంతో మాసూళ్లు ముందుగా వచ్చి తుపాన్లు, ముంపు నుంచి రైతులు తప్పించుకునే అవకాశం ఉంటుంది. ముందస్తు సాగు చేయాలంటే రైతులకు ముందుగా పూర్తి అవగాహన కల్పించాలి. గ్రామసభలు నిర్వహించి వివరించాలి. ఇప్పటి వరకూ అటువంటి చర్యలు ఏమీ కన్పించడం లేదు. ఖరీఫ్ సాగు ఆలస్యమైతే ఆ ప్రభావం రబీ సాగుపైనా పడుతోంది. జనవరి నెలాఖరు వరకూ రబీ నాట్లు పూర్తి కావడం లేదు. దీంతో సాగునీటి సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మే నెలాఖరు వరకూ రబీ మాసూళ్లు సాగుతున్నాయి. దీంతో మే నెలలో అకాల వర్షాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత రబీలోనూ అదే పరిస్థితి ఎదురైంది. వాతావరణం అనుకూలంగా ఉన్న తరుణంలో ఖరీఫ్ ముందస్తు సాగుకు ప్రణాళికలు రూపొందిస్తే రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ముందస్తు సాగుకు అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక రేషన్ దుకాణాల్లోనే సరుకులు

జూన్ ఒకటి నుంచి రేషన్ వాహనాలు నిలిపివేత

ఏలూరు జిల్లాలో 395, పశ్చిమలో 356 వాహనాలు

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు మాత్రమే ఇంటి వద్దే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గత ప్రభుత్వం తెచ్చిన ఇంటింటికీ రేషన్ అందించే ప్రక్రియను నిలిపివేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జూన్ ఒకటో తేదీ నుంచి ఇది అమల్లోకి రానున్నట్లు తెలిపింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇక నుంచి రేషన్ కార్డుదారులంతా రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి బియ్యం, ఇతర సరుకులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఏలూరు జిల్లాలో 6.31 లక్షల వరకూ తెల్లరేషన్‌కార్డులు ఉన్నాయి. 395 రేషన్ వాహనాల ద్వారా ప్రతినెలా బియ్యం, సరుకుల పంపిణీ జరుగుతోంది. పశ్చిమలో 5.67 లక్షల రేషన్ కార్డులు ఉండగా 356 వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఇంటింటికీ రేషన్ పంపిణీ పూర్తిగా నిలిచిపోనుంది. ఇక నుంచి ఏలూరు జిల్లాలో 1,123 రేషన్ దుకాణాల్లోనూ, పశ్చిమలో 1,052 దుకాణాల్లోనూ రేషన్ సరుకుల పంపిణీ జరగనుంది. ఇంటింటికీ రేషన్ పంపిణీపై ఆదిలో విమర్శలు వెల్లువెత్తినప్పటికీ ఇప్పుడు అంతా అలవాటు పడ్డారు. ప్రభుత్వం ఒక్కసారిగా రేషన్ వాహనాలు నిలిపివేయడంతో జనం మరోసారి ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. అయితే రేషన్ వాహనాలను నిలిపివేసిన తర్వాత ఇది ఎలా సాధ్యమో తెలియని పరిస్థితి ఉంది. రేషన్ వాహనాలను ప్రస్తుతం నిర్వహిస్తున్న లబ్ధిదారులకే ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రేషన్ వాహనాల నిలిపివేతపై జనం నుంచి ఎటువంటి స్పందన వస్తుందో వేచిచూడాలి.

విచారణ నివేదిక ఆధారంగా చర్యలు

జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నరసయ్య

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కైకలూరు మత్స్యశాఖ సహాయ సంచాలకులు రాజకుమార్ నివేదికను అనుసరించి నిడమర్రు మండల ఎఫ్‌డిఒపై చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖ అధికారి బి.నరసయ్య తెలిపారు. సోమవారం 'మత్స్యశాఖ రూటే వేరు' అనే శీర్షికన 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. నిడమర్రు మండలం మత్స్యశాఖ అభివృద్ధి అధికారికి సంబంధించిన విషయాలు మత్స్యశాఖ అధికారుల దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మత్స్యశాఖ అభివృద్ధి అధికారిపై విచారణ జరిపిస్తున్నామన్నారు. విచారణ అధికారిగా కైకలూరు మత్స్యశాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్‌ను నియమించామన్నారు. సదరు అధికారి విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించిన తర్వాత తదుపరి చర్యలు నిమిత్తం కమిషనర్‌కు పంపుతామని తెలిపారు. విచారణ పక్కదోవ పట్టలేదని, నిడమర్రు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి జారీచేసిన నోటీసులపై పారదర్శకంగా విచారణ జరుగుతుందని విచారణ అధికారి తెలియజేశారని పేర్కొన్నారు. నిడమర్రు తహశీల్దార్ ధ్రువీకరించిన పంటబోదెకు సంబంధించిన రైతులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే

కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరులో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస, ఐఎఫ్‌టియు నాయకులు రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని డిమాండ్ చేశారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లేబర్‌కోడ్‌ల పేరుతో కాలరాస్తుందని వారు విమర్శించారు. కార్యక్రమంలో ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, నేతలు బి.సోమయ్య, వివిఎన్.ప్రసాద్, ఎఐటియుసి నాయకులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, ఐఎఫ్‌టియు నాయకులు మీసాల రమణ, మంగ అప్పారావు, దూల వీరనాయుడు పాల్గొన్నారు.

ఏలూరులో...

జంగారెడ్డిగూడెంలో...

జంగారెడ్డిగూడెం: సిఐటియు ఆధ్వర్యాన స్థానిక బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణాధ్యక్షులు పి.సూర్యారావు, వ్యకాస జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడారు. కార్యక్రమానికి మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు బి.బాలరాజు, ఆటో యూనియన్ నాయకులు పి.సత్తిబాబు తదితరులు నాయకత్వం వహించారు.

నూజివీడులో...

నూజివీడు టౌన్: పట్టణంలోని చిన్నగాంధీ బొమ్మ సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణాధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్లు, పట్టణ కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించాలన్నారు. ఉపాధి కార్మికుల నుండి, సంఘటిత, అసంఘటిత కార్మికుల వరకు అన్ని దశల్లో కార్మికులు దోపిడీకి గురవుతూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు శోభనాద్రి, మరియదాసు, రంగారావు, సంసోను, నాగూర్, వీరన్న, పద్మాంజలి, రజిని, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి సెంటర్లో సిఐటియు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడేపల్లి హోలీ మేరీ, టిఎన్ఎం.సూరి, నాగేశ్వరరావు, రంగారావు, వెంకటేశ్వరరావు, బాలయ్య, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్: మండల కేంద్రంలో కార్మిక వ్యతిరేక కోడ్‌లకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సాయికిరణ్ మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు మండల ఉపాధ్యక్షులు కారం రాజేశ్వరి, నాయకులు మహమ్మద్ వలీపాషా, పాముల అన్నపూర్ణ, నాగలక్ష్మి, రమణ, నిర్మల వెంకటేశ్వర్లు, ఓగిరాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు డిఇఒ కార్యాలయ ముట్టడి వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ బదిలీలు, రేషనలైజేషన్ ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలు పాటించకుండా ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 21న చేపట్టిన డిఇఒ కార్యాలయ ముట్టడి వాయిదా వేసినట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉపాధ్యాయ సంఘాల మధ్య జరిగిన చర్చలు ఫలించాయని, కొన్ని సమస్యలు పరిష్కరించడానికి ఉన్నతాధికారులు అంగీకరించారని రవికుమార్ పేర్కొన్నారు. మరికొన్ని సమస్యలు విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చిన నేపథ్యంలో ముట్టడి కార్యక్రమం వాయిదా వేసినట్లు తెలిపారు.

ముదినేపల్లిలో భారీ వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున మొదలైన వర్షం ఉదయం 8 గంటల వరకు కురుస్తూనే ఉంది. ఈ వర్షానికి పలు గ్రామాల్లో వీధులు, అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. సుమారు నాలుగు గంటలపాటు కురిసిన వర్షంతో ప్రధాన రహదారులపైకి వర్షపు నీరు చేరింది. ప్రధాన రహదారులపై గోతులు ఉండటంతో వర్షపు నీరునిలిచి చెరువులను తలపించాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. పల్లపు ప్రాంతాల్లోని కాలనీల్లో నీళ్లు చేరి కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది.

వేతన బకాయిలు విడుదల చేయాలి

తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 ఉద్యోగుల

కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలని, కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా ఏలూరులో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ గత తొమ్మిదేళ్లుగా పని చేస్తున్న ఉద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నాయన్నారు. రోజుకు పది గంటలు పని చేస్తున్న ఉద్యోగులకు రోజుకు రూ.280 మాత్రమే జీతం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గత నాలుగు నెలల బకాయిలను విడుదల చేయాలని, కనీస వేతనం రూ.18,500కి పెంచాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాంలో భాగంగా ఈ ఉద్యోగులు ఎంతో నిబద్ధతతో ప్రసవించిన తల్లి బిడ్డలను క్షేమంగా వారి ఇళ్ల వద్దకు చేరుస్తున్నారని, కాని తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల క్షేమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయిందని వారు విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఒక్కరోజు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, పోసిబాబు, వెంకటేష్, శామ్యూల్, ప్రేమకుమార్, సాయి, నరేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉద్యోగులు, సిఐటియు నేతలు

ట్రిపుల్ ఐటిల్లో ప్రవేశానికి పెద్దసంఖ్యలో దరఖాస్తులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రాజీవ్‌గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో పియుసి ప్రోగ్రాంలో ప్రవేశానికి ఇప్పటి వరకు 48,891 దరఖాస్తులు అందినట్లు అడ్మిషన్స్ కన్వీనర్, రిజిస్ట్రర్, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ మంగళవారం తెలిపారు. నూజివీడులో ఆయన మాట్లాడుతూ అప్లికేషన్ ప్రాసెసింగ్ ఇబ్బందుల దృష్ట్యా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు అవకాశం కల్పించినట్లు చెప్పారు.

జీతాల చెల్లింపులో అన్యాయాన్ని సరిచేయాలి

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాల చెల్లింపులో జరుగుతున్న అన్యాయాన్ని సరి చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులు తమకు జీతాల చెల్లింపులో జరుగుతున్న అన్యాయాన్ని సరిచేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరంతా నీరు.. మాకు కన్నీరా? ఊరంతా వెలుగులు.. మా జీవితాల్లో చీకట్లా? ఇంజినీరింగ్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టండి, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలూ చెల్లించాలి అంటూ పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా వారికి మద్దతు తెలిపిన సోమయ్య మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఒక్కో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుడు దాదాపు రూ.నాలుగు లక్షలకు పైగా జీతాల వ్యత్యాసం వల్ల నష్టపోయారని ఆయన తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు స్కిల్డ్ జీతాలు చెల్లించాల్సి ఉండగా రాష్ట్రంలో అన్‌స్కిల్డ్ కార్మికుల కన్నా తక్కువ జీతాలు చెల్లిస్తున్నారన్నారు. దీంతో ఇంజినీరింగ్ కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికులకు తక్షణమే స్కిల్డ్ జీతాలు చెల్లించాలని, ఇప్పటివరకు ఒక్కో కార్మికుడు నష్టపోయిన రూ.నాలుగు లక్షలను తిరిగి చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వారాంతపు, పండుగ, క్యాజువల్ సెలవులు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి సంవత్సరం గడుస్తున్నా ఇంజినీరింగ్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని సరి చేయకపోవడం అన్యాయ మన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇంజినీరింగ్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని సవరించాలని ఆయన కోరారు. లేకపోతే ఇంజినీరింగ్ కార్మికులు చేపడుతున్న ఆందోళనకు తమ సంఘం తరపున పూర్తి మద్దతు తెలియజేసి వారి ఆందోళనలో భాగస్వాములు అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమానికి వినుకొండ రమేష్, సోమే శ్వరరావు, సాంబశివరావు, అశోక్, వెంకటరామయ్య, ఏలియా, ఆంజనేయులు, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రాజేష్ నాయకత్వం వహించారు.

ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ఉపాధి కూలీల ఆటోను ఢీకొన్న బస్సు

14 మందికి గాయాలు

వారిలో 8 మందికి తీవ్ర గాయాలు

సంఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన ఆటో

ప్రజాశక్తి - భీమడోలు

ఉపాధి హామీ కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో 14 మంది కూలీలు గాయాలపాలయ్యారు. వీరిలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుండుగొలను-తాడేపల్లిగూడెం 16వ నెంబర్ జాతీయ రహదారిపై భీమడోలు అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భీమడోలు వెలమపేట ప్రాంతానికి చెందిన ఉపాధి హామీ కూలీలు పనులకు వెళ్లేందుకు రెండు ఆటోల్లో ఉదయం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోలు భీమడోలు అయ్యప్ప స్వామి ఆలయ వద్దకు వచ్చేసరికి ఒక ఆటోను వెనుక నుంచి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో సదరు ఆటో ముందుగా వెళు న్న మరో ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోల్లో ప్రయాణిస్తున్న 14 మంది ఉపాధి హామీ కూలీలు గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న భీమడోలు సిఐ యుజె.విల్సన్, ఎస్ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు చేపట్టారు. వీరిని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వీరిలో ఎనిమిది మంది పరిసితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవల కోసం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు అంబులెన్స్‌లో తరలించారు. విషయాన్ని తెలుసుకున్న భీమడోలు ఎంపిడిఒ, ఉపాధి హామీ భీమడోలు అధికారి పద్మావతి దేవి, తహశీల్దార్ రమాదేవి హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. రోగులను పరామర్శించారు. అందుతున్న సేవలపై వైద్య బృందంతో చర్చలు జరిపారు. ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు సోదరులు భీమరాజు, జనసేన పార్టీ భీమడోలు మండల శాఖ అధ్యక్షులు పత్తి మదన్ పరామర్శించారు.

వైద్య సేవలు పరిశీలిస్తున్న పోలీసులు, ఎంపిడిఒ

రాష్ట్రస్థాయిలో రమణక్కపేట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ ఆటలో ఉమ్మడి కృష్ణా జిల్లా బాలికల జట్టు విజయం సాధించింది. ఈ నెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు చిత్తూరు జిల్లాలో నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు (రమణక్కపేట పాఠశాల విద్యార్థులు) అద్భుత ప్రతిభ కనబరిచి విజయం సాధించింది. ప్రతిభ కనబరిచి విజయం సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు వాకా నాగరాజును పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. రమణక్కపేట గ్రామానికి చెందిన మండల పరిషత్ అధ్యక్షురాలు కొండా దుర్గాభవాని, జనసేన జనరల్ సెక్రటరీ పాశం నాగబాబు, టిడిపి నాయకులు రంగు వాసు, జిల్లా ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ అభినందించారు.

పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

డ్వాక్రా సభ్యులకు రూ.2182.16 కోట్ల రుణ ప్రణాళిక

ప్రజాశక్తి - దెందులూరు

జిల్లాలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2182.16 కోట్ల రుణ ప్రణాళిక లక్ష్యంగా నిర్ణయించినట్లు సెర్ప్ సిఇఒ కరుణ వాకాటి చెప్పారు. స్థానిక వట్లూరులోని టిటిడిసిలో మంగళవారం డిఆర్‌డిఎ అధికారులు, సిబ్బంది, డ్వాక్రా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి కరుణ వాకాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరుణ వాకాటి మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధుల నిమిత్తం స్వయం ఉపాధి కార్యక్రమాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.2182.16 కోట్ల రుణాలను అందించనున్నట్లు తెలిపారు. సూక్ష్మ రుణ ప్రణాళికల రూపకల్పన, లబ్ధిదారుల ఎంపికలో హార్టికల్చర్, ఫిషరీస్, పశు సంవర్ధక, పరిశ్రమల శాఖ మొదలగు శాఖల సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో డ్వాక్రా సంఘాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని, డ్వాక్రా సంఘాల మహిళలకు మంజూరు చేసిన రుణాలు 99 శాతానికి పైగా వసూలవుతున్నాయని చెప్పారు. రుణాలు సద్వినియోగం చేసుకుని డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్, డాక్టర్ ఆర్.విజయరాజు, ప్రాజెక్ట్ మేనేజర్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, ఎపిఎంలు, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

కొవ్వలిలో పర్యటన

దెందులూరు :మండలంలోని కొవ్వలి గ్రామంలో సెర్ప్ సిఇఒ కరుణ వాకాటి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న యాన్యువల్ క్రెడిట్ లైవ్ లీ హుడ్ ప్లాన్ సర్వే గురించి డ్వాక్రా సంఘ సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. పలు వివరాలు అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.విజయరాజు, ప్రాజెక్ట్ మేనేజర్, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, ఎపిఎంలు, సిసిలు, విఒఎలు హాజరయ్యారు.

కొనసాగిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ పిలుపు మేరకు బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రోజు కొనసాగాయి. ఈ రిలే నిరాహార దీక్షలో ఎంపిటిసి సభ్యులు తెల్లం రమణ, గాలి దుర్గారావు, వైస్ ఎంపిపి గుగ్గులోత్ మోహనరావు, కొవ్వాసు గోవిందరాజు, మాజీ సర్పంచ్ కుంజా గంగులు, కారం రాఘవ పాల్గొన్నారు. ఆదివాసీ పార్టీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సోడెం ముక్కయ్య, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బొరగం రెడ్డి దొర మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివాసీలంటే చాలా చులకన భావం ఉందన్నారు. ఎన్నికల అనంతరం పరిపాలన సౌలభ్యం కోసం మంత్రి మండలిని ఏర్పాటు చేసినట్లే గిరిజన సలహా మండలిని కూడా ఏర్పాటు చేయాల్సి ఉన్నదన్నారు. కాని ఆదివాసీలపై చులకనభావంతో ఏర్పాటు చేయలేదని ఎద్దేవా చేశారు. కోర్స సతీష్, కరకం శ్రీను, దొరబాబు, ఎపిటిఎఫ్ నాయకులు, ఎబిఎ నాయకులు తెల్లం రాముడు, తెల్లం గంగరాజు, సరియం నాగేశ్వరరావు, కొవ్వాసు ఉసయ్య, మల్లం శ్రీను పాల్గొన్నారు.

వట్లూరు పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా మలేరియా అధికారి పిఎస్‌ఎస్.ప్రసాద్ సోమవారం పెదపాడు మండలం వట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారితో జ్వరాలపై, ఇతర అంటువ్యాధులపై వాకబుచేసి అవసరమైనా వారికి డెంగి, మలేరియా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారి సూచన మేరకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి లార్వా ఎలిమినేషన్ కార్యక్రమం నిర్వహించాలని, జ్వరం కేసులను పిహెచ్‌సికి తరలించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మలేరియా ల్యాబ్‌ను తనిఖీ చేసి ల్యాబ్ టెక్నీషియన్‌కు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, పిహెచ్‌ఎన్ సుబ్బలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సరళ, హెల్త్ అసిస్టెంట్ మేల్ శ్రీనివాసరావు, ల్యాబ్ టెక్నీషియన్ రేవతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు 19వ మంగళవారం ఘనంగా కొనసాగాయి. ఈ శిక్షణ తరగతులకు విద్యార్థులు క్రమం తప్పకుండా పాల్గొంటున్నారు. గ్రంథాలయ సిబ్బంది ముందుగా విద్యార్థులకు యోగా క్లాసులు నిర్వహించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ జి.శేషారత్నం పుస్తక పఠనంలోని పట్టుదల - కష్టం వల్ల కలిగిన విజయం నీతికథలను బోధించారు. కథ నీతిని చిన్నారులకు వివరించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ పి.శరత్ డ్రాయింగ్ టీచర్ విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, బి.రమేష్, ఎమ్‌డి.అస్లాంపాషా, ఎం.కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం'

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి రాష్ట్ర వడ్డీ సాధికారిక కన్వీనర్ భలే యేసురాజు అన్నారు. మండలంలోని దేవి చింతపాడులో కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్మించిన సిసి రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రామాలాభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. దీంతో గ్రామ ప్రాంతాల్లోని రహదారులన్నీ నాశనమైపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే గ్రామీణ ప్రాంత రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మహావిష్ణు, సముద్రుడు, ఎంకె.ఆనంద్‌బాబు, బుజ్జిబాబు, కృపానందరావు, జయ మంగళ సుబ్బరాజు, సైదు కొండలు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించకుంటే కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు శివారు వైఎస్‌ఆర్ కాలనీలో నెలకొన్న డ్రెయినేజీ సమస్యను వెంటనే పరిష్కరించకుంటే ముదినేపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆ కాలనీ వాసులు అన్నారు. మంగళవారం కాలనీ వాసులు మాట్లాడుతూ ఎంతో కాలంగా డ్రెయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామన్నారు. డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని గతంలో ఏలూరు ఆర్‌డిఒకు వినతి అందించినట్లు చెప్పారు. వైఎస్‌ఆర్ కాలనీలో 147 ఇళ్లల్లో 650 మంది నివాసం ఉంటున్నామని, ప్రధానంగా డ్రెయినేజీ సమస్య 12 ఏళ్ల నుంచి ఉందని చెప్పారు. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేక, చిన్న పిల్లలు ఆ మురుగు నీరులో వెళ్తుతున్నారని, దీంతో అంటు వ్యాధులు, దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, వాటి వల్ల ప్రజలు జ్వరాలు బారిన పడుతున్నట్లు తెలిపారు. మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల రోడ్లు పాడైపోయి వాహనాలు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కాలనీ మొత్తం వాసన దుర్భరంగా వస్తుందని, రోడ్లు కూడా దెబ్బతిని పాడైపోయాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి డ్రెయినేజీ సమస్యను పరిష్కరించి కాలనీ ప్రజల ప్రాణాలను కాపాడాలని, లేకుంటే మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ట్రిపుల్ ఐటీలో ఎన్‌సిసి క్యాంప్

నూజివీడు టౌన్ :నూజివీడు ట్రిపుల్ ఐటిలో నాలుగో ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సిసి విజయవాడ క్యాంపు మంగళవారం నిర్వహించారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలేంద్ర సింగ్, క్యాంపు ఎసిడెంట్ కెప్టెన్ సుబ్బలక్ష్మిలు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు బాలికలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. తొమ్మిది స్కూళ్లు, ఆరు కాలేజీల నుంచి 540 మంది బాలికలు పాల్గొనగా అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్స్ 11 మంది, పది మంది పర్మినెంట్ ఇన్‌స్పెక్టర్స్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ క్యాంపులో వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, హెల్త్, హైజన్, సోషల్ సర్వీస్ యాక్టివిటీ, రెండో ఆర్మీగా ఎన్‌సిసిని వినియోగించే తీరు నేపథ్యంలో యుద్ధ నిర్వహణ నైపుణ్యతలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొనే బాలికలకు ఎ, బి, సి సర్టిఫికెట్స్ ఎగ్జామ్స్‌కి అర్హత సాధిస్తారని వివరించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

జీలుగుమిల్లి :యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పి.నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లంకాలపల్లి గ్రామానికి చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన దుర్గారావు అనే వ్యక్తి రెండు సంవత్సరాలుగా ప్రేమ పేరుతో నమ్మించి శారీరకంగా వాడుకొని గర్భం దాల్చిన తర్వాత పెళ్లి చేసుకోమని అడిగితే చేసుకోనని మోసం చేశాడని సదరు యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఎలిమ్ స్కూల్‌లో బాల్యం పదిలం

పచ్చని చెట్ల మధ్య, ప్రకృతి ఒడిలో పాఠశాల నిర్వహణ

స్కూల్ అధినేత సమీనా జాన్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సమీనాజాన్

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు పట్టణం నడిబొడ్డున బాపునగర్‌లోని ఎలిమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చిన్నారుల బాల్యం ఎంతో పదిలంగా ఉంటుందని స్కూల్ అధినేత సమీనా జాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. పచ్చని చెట్ల మధ్య, ప్రకృతి పరవశించే వేళ విశాలమైన క్రీడా ప్రాంగణంలో పాఠశాల నిర్వహణ కొనసాగుతోందన్నారు. 2022 - 23 విద్యా సంవత్సరంలో 50 మంది విద్యార్థులు, ఏడుగురు ఉపాధ్యాయులతో ఏడో తరగతి వరకు పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు. విశాలమైన ఎకరానికి పైగా ఉన్న సొంత స్థలంలో ఎలిమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం 250 మంది విద్యార్థులు, 14 మంది ఉపాధ్యాయులతో నర్సరీ నుంచి పదో తరగతి వరకు 2025 - 26 విద్యా సంవత్సరం కొనసాగుతుందన్నారు.

ఎలిమ్ స్కూల్

విద్యార్థులకు ఎంతో అనువైన 22 విశాలమైన గదుల్లో విద్యా బోధన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కమ్యూనిటీ స్కిల్స్, ఇంగ్లీషుపై పట్టు సాధించడం లక్ష్యంగా విద్యాబోధన ఉంటుందన్నారు. ప్రతి చాప్టర్ విద్యార్థులకు అర్థమయ్యేలా పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వచ్చినా సమాధానం రాసేలా విద్యార్థులను తీర్చిదిద్దడం పాఠశాల ప్రత్యేకత అని తెలిపారు. బట్టీ పట్టడం.... కేవలం ప్రశ్నలు సమాధానాలు చెప్పడం తమ విద్యా విధానానికి పూర్తిగా వ్యతిరేకమన్నారు. క్రీడలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సృజనాత్మక అంశాలు, పలు సామాజిక కార్యక్రమాల్లో అవగాహన పెంపొందించనున్నట్లు తెలిపారు. దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం, గురువుల పట్ల మర్యాద, తల్లిదండ్రుల పట్ల ఆదరణ కలిగి ఉండడం వంటి అంశాలను బాల్య దశ నుంచి విద్యార్థులకు సోదాహరణంగా వివరిస్తున్నట్లు చెప్పారు. తమ పాఠశాలలో కేవలం చదువు ఒక్కటే ప్రాధాన్యత కాదని, చదువుతోపాటు సమాజంలో జీవించేందుకు ప్రతి అంశంలో నైపుణ్యత సాధించే దిశగా సుశిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. తమ పాఠశాలలో చదివే ప్రతివిద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతోపాటు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం తమ ఆశయంగా వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసనలు

జంగారెడ్డిగూడెంలో...

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండలంలోని పది గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ కూలీలు స్వచ్ఛందంగా పని ప్రదేశాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం, సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు పాల్గొని పంగిడిగూడెం, పేరంపేట గ్రామాల కూలీల సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. మండలంలో ఇప్పటికే రూ.40 లక్షల వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉపాధి హామీ కూలీలకు పేస్లిప్పులు ఇవ్వాలన్నారు. డిమాండ్లన్నీ తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, లేకపోతే ఉపాధి హామీ కూలీలందరినీ ఐక్యం చేసి ఉద్యమాలు, పోరాటాలు నిర్వహి స్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కమిటీ సభ్యులు యాగంటి సీత, జోడే సూర్యచంద్రరావు, సిహెచ్.లక్ష్మీనారాయణ, నిట్ట నాగరాజు, ఎం.అశోక్‌కుమార్, కె.సుబ్బారావు, పి.దుర్గ, పిల్లి పోతురాజు పాల్గొన్నారు.

ముసునూరు :లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీసం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కొడవలి శ్రీనివాస్, కంచర్ల రమేష్, కంచర్ల పోతురాజు, కంచర్ల దుర్గారావు, కంచర్ల రంగారావు, పిన్నిబోయిన శ్రీను, కంచర్ల మంగరావు, స్వామి, భాషా, కూతాటి ఏడుకొండలు, పోటు శ్రీను, కంచర్ల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం :ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ జ్యోతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు తామ ముత్యాలమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికులు, వ్యవసాయ కార్మికుల పట్ల అత్యంత నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తుందన్నారు. జులై తొమ్మిదో తేదీన జరగ బోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందు గుల ఫ్రాన్సిస్, వట్టి వీరయ్య, బుల్లెమ్మ, రాజేష్ పాల్గొన్నారు.

నిడమర్రు : ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గవర సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మండలంలోని భువనపల్లి, ఎనికేపల్లి, అడివికొలను గ్రామాల్లో సచివాలయాల వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గవర సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్‌తో పాటు జవారి అన్నవరం, వేల్పూరు ఆంజనేయులు, కోసూరి సుబ్రహ్మణ్యం, వేర్నాల రత్నం, రోకల రామలక్ష్మి, దత్తాడ శ్రీను పాల్గొన్నారు.



ముసునూరులో....

కలిదిండి : ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచి పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళిరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సానారుద్రవరం, భాస్కరరావుపేట, మూలలంక సచివాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధి హామీ సమస్యలపై డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు అందించారు. సిఐటియు మండల కార్యదర్శి జక్కుల మహేష్, ప్రజాసంఘాల నాయకులు వి.భాస్కరరావు, సిహెచ్.శ్రీకాంత్, పి.సత్యనారాయణ, బి.రామనాగేంద్రం, ప్రసాద్, విక్టర్‌పాల్, ఏసు, అనిల్‌కుమార్, సర్వేశ్వరరావు, మహాలక్ష్మి, వరలక్ష్మి, దుర్గ, మీనాకుమారి, దీప్తి, భాగ్య రాధ, మరియమ్మ, విజయ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించి తహశీల్దార్ పిఎస్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు, ఉపాధి హామీ చట్టం ఎపిఒ మీనాక్షికలకు వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు షేక్ జహంగీర్‌భాషా, సిఐటియు నాయకులు ముత్యాల నరేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు, స్టాలిన్, శ్యామూల్, అర్జునరావు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

ఏలూరు నియోజకవర్గ మినీ మహానాడులో ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



ఏలూరు సిటీ : మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బడేటి చంటి

కిలో రెండు రూపాయలు బియ్యం, పక్కా ఇల్లు, మండల వ్యవస్థ వంటి ఎన్నో సంస్కరణలు ఏర్పాటు చేసిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం మినీ మహానాడు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గన్ని వీరాంజనేయులు హాజరయ్యారు. ముందుగా నందమూరి తారక రామారావు విగ్రహానికి గన్ని వీరాంజనేయులు, ఎంఎల్‌ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నానుడితో నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి ఎన్నో సంస్కరణలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావుకు భారతరత్న ఇవ్వాలని తీర్మానించారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ పదవులు లభిస్తాయన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ 11 నెలలలో 90 శాతం పనులను చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఇడా ఛైర్మన్ పెదిబోయిన వెంకటప్రసాద్, ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ ఆంజనేయులు, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల :పేదల అభ్యున్నతికి, పార్టీ కార్యకర్తల సంక్షేమానికి టిడిపి పెద్దపీట వేస్తుందని గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు చెప్పారు. ద్వారకాతిరుమల వి కన్వెన్షన్‌లో టిడిపి గోపాలపురం నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి మినీ మహానాడును ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఎ వెంకటరాజు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి పునాది, బలం, శక్తి కార్యకర్తలేనన్నారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో సమగ్రాభివృద్ధికి టిడిపి పెద్దపీట వేస్తుందన్నారు. 1982లో నందమూరి తారక రామారావు పార్టీని స్థాపించి తెలుగువారి కీర్తిని దశదిశల వ్యాపింపచేశారన్నారు. తెలుగు వారి హృదయాల్లో ఎన్‌టి.రామారావు ఎప్పటికీ నిలిచి ఉంటారన్నారు. గ్రామాల్లో ఆధిపత్య పోరును విడనాడాలన్నారు. 2029లో కూడా పార్టీ గెలుపే లక్ష్యంగా అందరం కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ సత్తాను చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అత్యధికంగా సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ గోపాలపురం నియోజకవర్గంలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, టిడిపి కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నానో మిషన్ ఎనలైజర్‌తో పలు ఉపయోగాలు

ప్రజాశక్తి - చాట్రాయి

తిరువూరు క్లస్టర్ పరిధిలోని మండలంలోని వివిధ పాలసంఘాల అధ్యక్షులతో మంగళవారం తిరువూరులో కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నానో మిషన్ ఎనలైజర్ ఉపయోగాల గురించి చర్చించారు. ఈ నానోమిషన్లు నీటి శాతం ఫ్యాట్, ఎస్‌ఎన్‌ఎఫ్ కచ్చితత్వాన్ని తెలియజేస్తా యన్నారు. మినరల్ మిక్చర్, కాల్షియం, దాణా ఎలా వాడాలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యురాలు నెక్కళ్లపు వాణిశ్రీ, జిల్లా ట్రస్ట్ సభ్యులు పల్నాటి సత్యనారాయణ, ఫీడ్ కమిటీ సభ్యులు పి.సురయ్య, తిరువూరు క్లస్టర్ మేనేజర్ టి.సాంబశివమూర్తి, వివిధ పాల సంఘాల అధ్యక్షులు శేషగిరిరావు, బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, లక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వేమిరెడ్డి వెంకటరామిరెడ్డి, భూక్య పద్మ, నాగేశ్వరావు, బి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లెల్ల కృష్ణవేణి పాల్గొన్నారు.

జులై 5, 6, 7 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభ

చింతలపూడి :జులై 5, 6, 7 తేదీల్లో చింతలపూడి పట్టణంలో జరుగుతున్న సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో మహాసభ కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జిల్లా మహాసభ ప్రదర్శనకు ఐదు వేల మంది సిపిఐ సభ్యులు, సానుభూతిపరులు, ప్రజాసంఘాలవారు హాజరవుతారని, మహాసభ జయప్రదానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు.

మరో మత్స్యకార సంఘం వద్దంటూ ఆందోళన

ప్రజాశక్తి - టి.నర్సాపురం



వినతిపత్రం అందిస్తున్న ఆందోళనకారులు

మండలంలోని బొర్రం పాలెంలో తమకు తెలియకుండా మరొక మత్స్యకార సంఘం ఏర్పాటు చేయవద్దంటూ స్థానిక మత్స్యకార సంఘ సభ్యులు మంగళవారం ఆందోళన చేపట్టారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఇఒపిఆర్‌డి శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ గ్రామంలో గత 30 ఏళ్లగా మత్స్యకార సంఘం కొనసాగుతుందని, పంచాయతీలో ఉన్న 14 మంది వార్డు సభ్యుల్లో తొమ్మిది మందికి తెలియకుండా కొందరు వ్యక్తులు తప్పుడు తీర్మానాలు పొంది మత్స్యకార సంఘాన్ని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారంటూ ఆరోపించారు. వెంటనే ఆ ఆలోచన విరమించాలని డిమాండ్ చేశారు. మరో మత్స్యకార సంఘం ఏర్పాటుకు తీర్మానం ఎలా చేశారంటూ పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావును ఫోన్ ద్వారా ప్రశ్నించారు. ఈ సందర్భంగా కార్యదర్శి స్పందించి ఆ తీర్మానాన్ని రద్దు చేస్తామని వారికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు బత్తుల రమేష్, గుండె చిన్న చిట్టియ్య, రాంబాబు వెంకటేష్, శ్రీను, తదితరులు ఉన్నారు.

జిఒ 4లోని మార్గదర్శకాలను సవరించాలి

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శి ఈ నెల 17వ తేదీన విడుదల చేసిన జిఒ-4 లోని మార్గదర్శకాలను సవరించాలని గ్రామ రెవెన్యూ అధికారులు కోరుతున్నారు. ఈ మేరకు శంకర్ ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ అధికారులు మంగళవారం భీమడోలు తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శి విడుదల చేసిన జిఒ-4 మార్గదర్శకాల్లో జనాభా ప్రాతిపదికన గ్రామాన్ని రెండు సచివాలయాలుగా విభజించనున్నారని తెలిపారు. రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా పరిగణనలోనికి తీసుకోనున్నారన్నారు. దీనిలో భాగంగా క్లస్టర్ పరిధిలో ఒక గ్రామ రెవెన్యూ అధికారి, ఒక సర్వేయర్ మాత్రమే ఉంటారని తెలిపారు. ఇది సైతం భూవిస్తీర్ణం ఆధారంగా కాకుండా జనాభా ప్రాతిపదికను విభజించనున్నారని తెలిపారు. దీని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 7500 మంది గ్రామ రెవెన్యూ అధికారులు ఏ శాఖ పరిధిలోకి వస్తారన్న విషయమై స్పష్టత లేదన్నారు. ఇదే జరిగితే వివిధ ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో పనిభారమైనప్పటికీ పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులపై మరింత ఒత్తిడి పెరుగుతుందని, దీని కారణంగా వారు అనారోగ్య కారణాలు, ఇతర ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం రెవెన్యూ గ్రామాల వారీగా ఒక విఆర్‌ఒ నియామకాన్ని కొనసాగించాలని వారు కోరారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

వేలేరుపాడు : గోదావరి వరదలు దృష్టిలో ఉంచుకుని ముంపు గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య కోరారు. మండలంలోని ఇప్పలగుంపు, ఉదయ నగర్, పూచిరాల, పాత పూచిరాల శాఖ సమావేశాలు ఆయా గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోడు వ్యవసాయం నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలకు ఆయా భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్టు మరమ్మతు పనులు వెంటనే చేపట్టాలన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చింతల పూడిలో జులై 5, 6, 7 తేదీల్లో నిర్వహించే జిల్లా మహాసభ జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ఏలూరు మండలం కాపురస్తులు మానికల సందీప్ కౌషిక్ తండ్రి మానికల వెంకటేశ్వరరావు అనునేను వ్రాయించియిచ్చిన అఫిడవిట్ నా తల్లి గారైన (లేటు) మానికల నందగౌరి గారి తాలూకా ఏలూరు జిల్లా, ఏలూరు నరసింహారావు పేట, ఆర్.వి రామారావు వీధి.ఆర్.ఎస్.నెం. 5567/1989, 5568/1989లో 207 చ.గజముల నివాస భూమికి చెందిన ఏలూరు రిజిష్టారు వారి కార్యాలయంలో రిజిష్ట్రీ పొందిన లింక్ డాక్యుమెంట్స్ తేది.04.10.1989 గల లింక్ డాక్యుమెంట్‌ను ది.12.04.2025 తేదిన వట్లూరు నుండి ఏలూరు వస్తుండగా పైన తెలిపిన డాక్యుమెంట్ మార్గమధ్యలో పోగొట్టుకొవడం జరిగినది. ఎవరికైన దొరికిన యెడల ఈ నెంబరుకు తెలుపగలరని కొరుచున్నాను. మానికల సందీప్ కౌషిక్ తండ్రి: మానికల వెంకటేశ్వరరావు సెల్ : 63054 52492

వంశీ బెయిల్ పిటీషన్ 22కు వాయిదా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు పట్టణంలోని సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో గన్నవరం మాజీ ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్‌కు సంబంధించి ఇరుపక్షాల వాదనలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 22వ తేదీకి జడ్జిమెంట్ వాయిదా వేశారు. అదే రోజు బెయిల్ పిటిషన్ వేసేందుకు అవకాశం కల్పించారు. ఈ నకిలీ పట్టాల పంపిణీ కేసుకు సంబంధించి గన్నవరం మాజీ ఎంఎల్‌ఎ వల్లభనేని వంశీ నెల 17వ తేదీన నూజివీడు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరయ్యారు. ఇప్పటికే వంశీని రెండు రోజుల కస్టడీకి హనుమాన్ జంక్షన్ పోలీసులు కోరారు.

ఎపిఇఎపి సెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే ఎపిఇఎపి సెట్ 2025 పరీక్షలు రెండో రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షల్లో వట్లూరులోని సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం మొత్తం 190 మందికి 181 మంది హాజరు కాగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 141 మంది హాజరు కాగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. సిద్ధార్థ క్వెస్ట్ కళాశాలలో 161 మందికి 149 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో కలిపి మొత్తం 501 మందికి 471 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 147 మందికి 141 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 190 మందికి 185 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. అలాగే సిద్ధార్థ క్వెస్ట్‌లో 161 మందికి 152 మంది హాజరు కాగా తొమ్మిది మంది గైర్హాజరయ్యారు. మూడు కేంద్రాల్లో మొత్తం 498 మందికి 478 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు.

మోటూరు మాజీ ఉప సర్పంచి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల శివారు మోటూరు గ్రామ మాజీ ఉప సర్పంచి పులవర్తి మాధవరావు(75) మంగళవారం మృతి చెందారు. మాధవరావు మోటూరు గ్రామ ఉపసర్పంచితో పాటు గ్రామ సొసైటీ డైరెక్టర్‌గా సేవలందించారు. మాధవరావుకు భార్య, కుమారులు, కుమార్తె ఉన్నారు. మాధవరావు మృతదేహాన్ని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సేవ నాగ జగన్ బాబూరావు సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. అలాగే పలువురు మాధవరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

గోల్డ్ బాండ్ స్కీమ్‌లో శ్రీవారి బంగారం డిపాజిట్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి హుండీల ద్వారా వచ్చిన బంగారం మిశ్రమం 4 కేజీల 940 గ్రాములు గోల్డ్ బాండ్ స్కీమ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాళేశ్వరం మార్కెట్ బ్రాంచ్‌లో డిపాజిట్ చేశారు. చినవెంకన్న ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్‌విఎస్‌ఎన్.మూర్తి, బాబూరావు డిప్యూటీ కమిషనర్, వి.వి.పల్లంరాజు, జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ సమక్షంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ వారికి మంగళవారం అప్పగించారు.

జాతీయ రహదారి పనులు ప్రారంభం

జీలుగుమిల్లి :మండలంలోని తాటియాకులగూడెం నుంచి పట్టిసీమ వరకు జాతీయ రహదారి పనులను మండలంలో మంగళవారం నుంచి ప్రారంభించినట్లు జాతీయ రహదారి ఎఇ ఖాజాబాబు తెలిపారు. మండలంలోని బర్రింకలపాడు సమీపంలో జాతీయ రహదారి విస్తరణకు పరిహారం అందించిన భూముల్లో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రెండు లైన్లకు 22 మీటర్ల మేర, 70 అడుగుల వరకు రోడ్డును బాగు చేసి మట్టి పనులు పూర్తి చేయడంతో ఏజెన్సీ గుండా జాతీయ రహదారి నిర్మాణ రూపు సంతరించుకుంది. ఇదిలా ఉంటే జీలుగుమిల్లి సెంటర్‌లో జాతీయ రహదారి విస్తరణకు దుకాణాలు ఇచ్చిన దుకాణాదారులు నిర్మాణ పనులు ప్రారంభించడంతో పరిహారం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

పేరు మార్పు / సవరణ

నేను లక్కు సావిత్రి, W/o లక్కు ఏడుకొండల శ్రీనివాసు (లేట్), నివాసం : డోర్ నెం.25-16, కొత్తకాయల తిప్ప, మొగల్తూరు, పశ్చిమగోదావరి జిల్లా. ప్రస్తుత ఆధార్‌లో నా కుమార్తె పేరు లక్కు నాగ దుర్గ మహేశ్వరి అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు 10వ తరగతి మార్కుల జాబితా ప్రకారం పేరు సవరణ చేయగా **లక్కు నాగ దుర్గాదేవి D/o లక్కు ఏడుకొండల శ్రీనివాసు (Lakku Naga Durga Devi, D/o Lakku Edukondala Srinivasu)** గా మార్పు చేయుట జరిగినది. ఈ రోజు నుంచి నా కుమార్తె పేరు **లక్కు నాగ దుర్గాదేవి** గా పిలవబడును.

డాక్యుమెంట్లు పోయినవి

పెదవేగి మండలం కొప్పాక గ్రామం నుంచి శనివారం ఏలూరు వస్తుండగా మార్గమధ్యంలో నాకు చెందిన స్థలం డాక్యుమెంట్లు పోయినవి. మూడు రోజులుగా వెతికినా అవి దొరకలేదు. ఎవరికైనా దొరికితే అందించవలసిందిగా కోరుచున్నాను.

డాక్యుమెంట్ నంబర్ : 6807/1992

అడ్రస్ : BH .వాసు, s/o. రామలింగేశ్వరరావు(లేట్) కొప్పాక (పోస్ట్), పెదవేగి మండలం pin no : 534003 Phone no : 94934 76956, 93460 66909.